చెయ్యేరులో ఉపాధి పనుల తనిఖీ

విశాలాంధ్ర - కాట్రేనికోన : చెయ్యేరు గ్రామంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను మంగళవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్. మధుసూదన్ ఆకస్మిక తనిఖీ చేశారు. క్షేత్ర సాయి నుండి ఎంసిసి సిబ్బందిని వివిధ అంశాల మీద రివ్యూ చేశారు. రివ్యూలో లేబర్ బడ్జెట్, ఆధార్ నాట్ సీడెడ్, అథంటికేషన్ పెండింగ్, అవరేజ్ వేజ్ రేటు, తదితర అంశాలను రివ్యూ చేసి పలు సూచనలు చేశారు. పనులలో అక్రమాలు లేకుండా నాణ్యతతో రైతులకు ఉపయోగపడేలా చేయాలని పిడి సూచించారు. ఈ రివ్యూలో ఏపీఓ శ్యామ్, ఈసి, సాంకేతిక సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తీవ్ర సంక్షోభంలో వ్యవసాయ రంగం

విశాలాంధ్ర - అమలాపురం : దేశంలోనూ, రాష్ట్రంలోనూ వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో ఉందని జనసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం అమలాపురంలోని ఈదరపల్లి జనహిత భవనంలో రైతాంగ సమస్యలపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి పలువురు రైతు సభ్యులు హాజరై మాట్లాడారు. వ్యవసాయరంగం రైతులకు అమ్మబోతే అడవి కొనబోతే కొరివి చందాన ఉందన్నారు. రైతు నాయకుడు తిక్కిరెడ్డి గోపాల కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాల వల్ల ఆశించిన ఫలితం రావటం లేదన్నారు. ధాన్యం అమ్మినా సకాలంలో రైతులకు పంట అమ్మినా సొమ్మురావటం లేదన్నారు. ఉప్పుగంటి భాస్కరరావు మాట్లాడుతూ భూ సర్వ వల్ల రైతులకు మేలు జరగటం లేదన్నారు. ఆర్‌బికేల మూలంగా రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. సమావేశంలో అఖిల భారత కార్యవర్గ సభ్యుడు ముదిగంటి శ్రీధరెడ్డి, మాజీ అధ్య క్షుడు జి. రాంబాబు, జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమార స్వామి, కల్వకొలను తాతాజీ, కుడుపూడి సూర్యనారాయణ, యాళ్ల వెంకటానందం సూదా చిన్న, టీ గోపాల కృష్ణ, కె. సత్తిబాబు, మహదాస నాగేశ్వరరావు, దొంగ నాగేశ్వరరావు, వర్రే శేషు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ధర్నా

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండల కేంద్రం కపిలేశ్వరపురం గ్రామంలోని ఐసీడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ధర్నా నిర్వహించారు. వేతన బకాయిలు సత్వరమే చెల్లించాలని, జీఓ నంబర్ వన్ బేషరతుగా రద్దు చేయాలని, రాజకీయ నాయకులు వేధింపులు విడనాడాలని, మినీ అంగన్వాడి వర్కర్లుకు సమాన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు వర్కర్ల, హెల్పర్ల అధ్యక్షురాలు మేడిశెట్టి బేబీ నాయకత్వం వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి సిహెచ్ వాణి, జానకి దేవి, అనంతలక్ష్మి, వీరలక్ష్మి. ఎం. కుమారి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

టేకి శివారులో సైక్లిస్టు మృతి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మాచర-టేకి మార్గ మధ్యలో మంగళవారం ఫిట్స్ రావడంతో సైక్లిస్ట్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై అంగర పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం అంగరకు చెందిన గుత్తుల శ్రీనివాస్ (35) మంగళవారం తన అత్తవారి ఊరైన మాచర నుంచి అంగరకు సైకిల్‌పై వస్తున్నాడు. టేకి శివారులోని రేకుల చావిడి వద్దకు చేరుకున్నాక ఫిట్స్ వచ్చాయి. పక్కనే ఉన్న పంట పొలంలో పడి మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్ళంరాజు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కేంద్ర మాజీ మంత్రి, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంఎం పళ్ళంరాజు 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని 61వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకటరావు స్వగృహం లో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఉమ్మిడి సురేష్, పోతబత్తుల పెద్దబాబు, సిరిపురపు బాబీ, ఉంగరాల శివ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా వ్యవహరించినందుకు సన్మానం

విశాలాంధ్ర - అంబాజీపేట : మండలంలోని మాచవరం గ్రామం కోటివారి అగ్రహారంనకు చెందిన 64 సంవత్సరముల పేరి మృదుల కుమారి జనవరి 23 వతేదీ సోమవారం మధ్యాహ్నం అమలాపురం నుండి బండారులంక వెళ్ళే ఆటోలో వెళుతూ 1,42,000 రూపాయల నగదుతో ఉన్న క్యాష్ బ్యాగును పోగొట్టుకుంది. ఆమె సదరు ఈ విషయం అమలాపురం తాలూకా పోలీస్ వారికి తెలియపరచగా వెంటనే పోలీసు వారు బండారులంకకు వెళ్లి విచారణ చేయగా బండారులంక గ్రామానికి చెందిన పెంటపాటి నాగ వెంకట మంగతాయారు తనుజ నిజాయితీగా బ్యాగ్‌ను పేరి మృదుల కుమారికి అప్పగించారు. పెంటపాటి నాగ వెంకట మంగతాయారు తనూజ నిజాయితీకి మెచ్చి అమలాపురం రూరల్ సిఐ వీరబాబు, అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ యస్‌ఐ ఎ. పరదేశి ఆమెను మంగళవారం స్టేషన్‌లో సత్కరించారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

విశాలాంధ్ర - రాజోలు : మలికిపురం మండలంలోని స్థానిక ఎంవిఎన్‌జెఎస్ & ఆర్‌విఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ యుబిఎ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ బాలికలను కాపాడాలి. వారి హక్కులను పరిరక్షించాలని, బాలికలను చదువు పట్ల ప్రోత్సహించాలని, భ్రూణహత్యలు ఆపు చేయాలి అన్నారు. ఈ సందర్భంగా బాలికలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెక్రటరీ అండ్ కస్పాండెంట్ ఎంవి సత్యనారాయణమూర్తి, స్పందన ఈదా ఇంటర్నేషనల్ జిల్లా కార్యదర్శి పివి ప్రసాద్, ప్రముఖ అంతర్జాతీయ చిత్రకారుడు ఎస్. సంగీత్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నక్కా రమేష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

డాక్టర్ జొన్నకూటికి సేవారత్న అవార్డు

విశాలాంధ్ర - తాళ్లపూడి : మండలంలోని పైడిమెట్ట గ్రామానికి చెందిన డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్‌కు సేవా రత్న అవార్డు లభించింది. హైదరాబాద్ లో రుద్ర స్టూడియో టేలెంట్ అవార్డ్స్ ఫంక్షన్ లో సేవారత్న అవార్డ్ ను అందుకున్నారు. హైదరాబాద్ లోని సత్య సాయి సేవా నిగమ్ వేదిక గా జరిగిన ఈ అవార్డ్ ఫంక్షన్ కార్యక్రమంలో రుద్ర స్టూడియో స్ అధినేత రుద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాపరంగానే కాకుండా సామాజిక చైతన్యానికి పాటుపడుతూ ప్రమోద్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు పలువురికి ఆదర్శం అని కొనియాడారు. కార్యక్రమంలో పలు సామాజిక సేవా సంస్థల ప్రతినిధులను, బుల్లి తెర కళాకారులను సన్మానించారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు

విశాలాంధ్ర - కొత్తపేట : విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు అంటూ సిపిఐ, ఏఐటియుసి పిలుపు మేరకు మంగళవారం కొత్తపేట రెవిన్యూ డివిజన్ కార్యాలయం వద్ద దీక్ష ప్రారంభించారు. ఈ దీక్షలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో విశాఖ ఉక్కు గురించి పెద్ద పోరాటం జరిగిందని ఆ పోరాటంలో విద్యార్థి, యువజన సంఘాలకు చెందిన 32 మంది కాల్పులలో చనిపోయారన్నారు. వారి మరణాలకు నిరసనగా విశాఖలో ఉక్కు నిర్మాణం చేయాలని సిపిఐ, ఇతర వామపక్ష నేతలు రాజీనామాలు చేశారని, ఇన్ని త్యాగాల ఫలితమే విశాఖ ఉక్కు ఏర్పడిందని ప్రభాకర్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడాన్ని సిపిఐ, ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

విశాఖ ఉక్కు కోసం జరుగు తున్న ఈ పోరాటంలో ప్రజాసంఘాలు అందరూ కలసి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కే. సత్తిబాబు, కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ కే. రామకృష్ణ, కొత్తపేట మండల కార్యదర్శి మోకా హేమలత, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జి. రవికుమార్, ప్రజానాట్యమండలి జిల్లా సెక్రెటరీ వి. శ్యామ్, రావులపాలెం మండల కార్యదర్శి కర్రి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో : 32 మంది ఆత్మబలిదానంతో సంపాదించుకున్న విశాఖ స్టీలు ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని ఏఐటీయుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు రేఖ భాస్కర రావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచనను నిరసిస్తూ మంగళవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఎం. నాగేంద్రప్రసాద్, పి. రామాంజనేయులు,

పి. వెంకట్రావు, కె.శ్రీను, ఎం. సన్యాసిరావు, ఆర్.శ్రీను, పరదేసినాయుడు, ఎ. లక్ష్మీ నారాయణ, కె. రాంబాబు, సీహెచ్ సన్యాసిరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంసన్ మృతి సమాజానికి తీరని లోటు

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన మాజీ కమ్యూనిస్టు గుర్రం శాంసన్ మృతి సమాజానికి తీరని లోటు అని పలువురు వక్తలు అన్నారు. సోమవారం గుర్రం శాంసన్ మరణించారు. మంగళవారం మలికిపురంలో ఆయన అంతిమయాత్ర నిర్వహించారు. అనంతరం సిపిఐ రాజోలు నియోజకవర్గం కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో పలువురు మాట్లాడుతూ దళితులు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని ప్రగతి ఇండస్ట్రీస్‌ను ప్రారంభించారని తెలిపారు. మేధోపరమైన ఆలోచనలతో చైతన్యవంతులు కావాలని కలలుగన్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కమ్యూనిస్టు భావాలతో పాటు అంబేద్కర్ ఆశయాలను పుణికి పుచ్చుకున్న శ్యాంసన్ అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించారని, పేదల పట్ల అకుంఠిత దీక్షతో పోరాడే వారని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమన్వయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు బత్తుల లక్ష్మణరావు, బీఎస్పీ రాష్ట్ర నాయకులు కొల్లాబత్తుల సత్యం, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సరెళ్ళ విజయ ప్రసాద్, చింతా రాజబాబు, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు కొండా దుర్గారావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు జిల్లెల్ల మనోహర్, గేద్దం పిలిప్ రాజు, ముప్పర్తి సత్తిరాజు, నల్లి శివ, తోటే జానుబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - కొవ్వూరు: విద్యార్థులు రోడ్లపై ప్రయాణించేటప్పుడు మరి ముఖ్యంగా మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తున్నప్పుడు రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటించాలని వాటిపై మరింత అవగాహన తెచ్చుకోవాలని కొవ్వూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ భీమారావు సూచించారు.

జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా కొవ్వూరులోని అభ్యాస పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదంలో అవగాహనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలను పాటించకపోవడం వాటిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జమీర్, స్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా కళాకారులు కృష్ణకు సతీ వియోగం

విశాలాంధ్ర-అమలాపురం : ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు, అభ్యుదయ గేయ రచయిత పోలిశెట్టి రామకృష్ణ (జగన్నాథగిరి కృష్ణ) కు సోమవారం రాత్రి సతీ వియోగం జరిగింది. పోలిశెట్టి అమ్మాజీ (60) గుండెపోటుతో సోమవారం మధ్యాహ్నం కాజులూరు మండలం జగన్నాథ జరిగే గ్రామంలో తమ స్వగృహంలో మృతి చెందారు. ఆమెకు భర్త కృష్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కృష్ణను పలువురు కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. సీపీఐ సీనియర్ నాయకులు డాక్టర్ చెలికాని స్టాలిన్, రామచంద్రపురం కార్యదర్శి పెద్దిరెడ్డి రాము, ఏఐటీయూసీ అమలాపురం ఉండవల్లి గోపాలరావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు సామ్యూల్, మందపల్లి ప్రేమానందం, వేమవరపు రాంబాబు, కే చంద్రరావు, తదితరులు కృష్ణను పరామర్శించి సానుభూతి తెలిపారు.

చేతి వృత్తుల సంఘం ఉపాధ్యక్షుడుగా రామకృష్ణ

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, జిల్లా చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణ మూర్తి అల్లవరం మండలానికి చెందిన బొక్కా రామకృష్ణను, జిల్లా చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం ఉప అధ్యక్షులుగా, అధ్యక్షులు దేవాదుల సూర్య నారాయణమూర్తి నియమించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా బొక్కా రామకృష్ణ మాట్లాడుతు జిల్లా సంఘాన్ని బలోపేతం చేస్తానని, చేతి వృత్తిదారు, భవన నిర్మాణ కార్మికులకు, న్యాయబద్ధమైన సేవ చేస్తానని, చేతి వృత్తిదారులు భవన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, రాష్ట్ర దృష్టికి తీసుకువెళ్తాన్ని, సంఘ సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు, జిల్లా చేతి వృత్తుల సంఘం అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తికి, ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, క్రమశిక్షణ కమిటీ సభ్యులు మట్టపర్తి సాయిబాబా, జిల్లా మైనార్టీ సెల్ షేక్ కరిముల్లా బాబా, అమలాపురం నియోజకవర్గ కన్వీనర్ పాటి వెంకటరామయ్య, గిడ్ల రాంబాబు, గిడ్ల సురేష్, పలువురు ధన్యవాదాలు తెలిపారు.

ఢిల్లీలో కోనసీమ ప్రభల వైభవం

విశాలాంధ్ర - అంబాజీపేట : మండలంలోని మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే తీర్థానికి వచ్చే ఏకాదశ రుద్రుల ప్రభల నమూనా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో రాష్ట్ర శకటంపై కొలువుదీరనుంది. గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివ కేశవ యూత్ సభ్యులు ఈ తీర్థ విశేషాలను దేశ ప్రధాని నరేంద్ర మోదీకి వివరిస్తూ 2020లో ఈ మెయిల్ చేశారు. మోదీ తీర్థం ప్రాశస్త్యాన్ని అభినందించారు. ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు వెళ్లే రాష్ట్ర ప్రభుత్వ శకటంపై జగ్గన్నతోట తీర్థానికి వచ్చే ఏకాదశ రుద్రులను ప్రదర్శనకు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించినట్టయ్యింది.

ఐసిడిఎస్ ఉద్యోగులపై దాడికి ముమ్మిడివరంలో నిరసన

విశాలాంధ్ర - కాట్రేనికోన : రాయచోటి జిల్లాలోని సంక్షేమశిశు సంక్షేమ శాఖ అధికారిని కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ యువరాజు, జూనియర్ అసిస్టెంట్ వివేకానంద, టైపిస్టు భాషాలపై అంగన్వాడి ఆయా బదిలీ విషయమై రాయచోటి ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు పోలు సుబ్బారెడ్డి, మహేశ్వర రెడ్డిలు దాడికి నిరసనగా రాష్ట్ర సంఘం పిలుపుమేరకు మంగళవారం ముమ్మిడివరం ఐసిడిఎస్ కార్యాలయం సిబ్బంది భోజనం విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ దాడిని తీవ్రంగా వారు ఖండించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి, ప్రభుత్వపరంగా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని వారు వినతి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పి. సుబ్బారాయుడు, ముమ్మిడివరం ప్రాజెక్టు కార్యాలయ పర్యవేక్షకులు కెవివిఎస్ టి. కుమారి, ఎం విజయ గౌరీ, పీహెచ్ పల్లవి, జివిఎస్ఎన్ దేవి, జె. మీనాక్షి, సిబ్బంది కె. సూర్యనారాయణ, గెద్దం అప్పారావు, బి. రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

22వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంగళవారం 22వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసు కుంటూ మూడున్నరేళ్ళ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, వైఎస్సార్‌సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, కార్పొరేటర్ ఎంజీకే కిషోర్, పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ దళారీ వ్యవస్థకు దూరంగా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకపాలన అందిస్తున్నారన్నారు. ఏపీలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు, పాలనా సంస్కరణలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబు, ఆరోగ్య అధికారి డాక్టర్ పృద్వీచరణ్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఏం కష్టం వచ్చిందని పాదయాత్ర

విశాలాంధ్ర - కాకినాడ : లోకేష్ పాదయాత్ర ప్రజలకోసం కాదని, ఒళు కరిగించుకునేందుకేనని సిటీఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ద్వారంపూడి విలేకర్లతో మాట్లాడుతూ లోకేష్ తన కొవ్వు కరిగించేందుకే పాదయాత్ర చేపట్టారని, తాను రాజశేఖరరెడ్డి, చంద్రబాబు పాదయాత్రలు చూశానని, నేడు ప్రజలకు ఏం కష్టంవచ్చిందని పాదయాత్ర చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు పూర్తిచేయని కారణంగా జగన్ పాదయాత్ర చేపట్టారని, ఎన్నికల్లో మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం 97 శాతం పూర్తిచేసిన ఘనత వైసీపీదేనన్నారు. తనపై కొండబాబు గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గంలో మట్టితవ్వకాలపై కొండబాబుకు ఏం సంబంధమని, దానిపై అక్కడి స్థానిక ఎమ్మెల్యే చినరాజప్పను అడిగి తెల్సుకోవాలన్నారు. కత్తికి లేని దురద చందాన కొండబాబు దోపిడి గూర్చి మాట్లాడుతున్నారని, చినరాజప్ప సమయంలోనే మట్టి తవ్వకాలు జరిగాయని ద్వారంపూడి విమర్శించారు. నీకు దమ్ముంటే చినరాజప్పతో కొండలన్నీ 2014-19 కాలంలో బకెట్ మట్టికూడా దోపిడీ కాలేదని నిరూపించాలన్నారు. ఈ సమావేశంలో కుడా చైర్మన్ చంద్రకళ, మాజీ మేయర్ శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బాలికలు విద్యతోనే అభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర - కరప : గురజనాపల్లి హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం బిఆర్‌వి ప్రసాదరావు మాట్లాడుతూ బాలికలు ప్రభుత్వం వారు సమకూర్చిన సదుపాయాలతో బాగా చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాల అని కోరారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు యమ్ మాణిక్యాంబ మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అని తెలిపారు. స్టాఫ్ సెక్రటరీ ఐ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల భద్రత కోసం దిశా ఏప్, డ్రాప్ ఎట్ హోం, మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు అని తెలిపారు. మరియు నిర్భయ చట్టం, పోక్సో చట్టం, గృహహింస నివారణ చట్టం, మహిళా రిజర్వేషన్ ఏర్పాటు చేశారు అని తెలిపారు. జీరో ఎఫ్‌ఐఆర్ ద్వారా మహిళలపై ఏదైనా అఘాయిత్యాలు జరిగితే ఎక్కడైనా కేసు నమోదు చేసు అవకాశం కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.భవాని, కె. సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై కార్యక్రమాలు

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు పాశుపతాస్త్రం లాంటిదని తహసిల్దార్ బి. రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బుధ వారం జరిగే 13వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రం నెంబర్ 66 లో గల గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకా తిరుమల లోని 248 పోలింగ్ కేంద్రాల పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక కొండవీటి డిగ్రీ కళాశాల విద్యార్థులు, బూత్ లెవెల్ ఆఫీసర్లు తో ర్యాలీ, వృద్ధ, దివ్యాంగ ఓటర్ లకు సన్మానము, రచన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఆదిత్యలో ప్రశాంతంగా జెఈఈ మెయిన్స్ పరీక్షలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్యా ఇంజనీరింగ్ కళాశాలల ప్రాంగణంలో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నుంచి జెఇఇ మెయిన్స్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు ప్రిసిడింగ్ ఆఫీసర్‌గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, టెస్ట్ సెంటర్ అడ్మిన్‌గా ప్రొ ఎం. రాజబాబు వ్యవహరిస్తున్నారు. మంగళవారం పరీక్షకు 115 మంది హాజరు కావలసి ఉండగా ఒక్కరు గైర్హాజర్ అయ్యారని రాజబాబు తెలిపారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీలు), నేషనల్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీలు), ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీలు), తదితర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నిర్వహించే జేఈఈ మెయిన్ తొలివిడత పరీక్షలు మంగళవారం ఉదయం ప్రారంభం అయ్యాయి.

వ్యవసాయ శాఖ సిబ్బంది సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - కిర్లంపూడి : గ్రామ వ్యవసాయ సహాయకులు మళ్ల రామకృష్ణ తొలకరి సీజన్‌లో రైతులకు అందించిన సేవలు మరచిపోలేనివని పలువురు రైతులు అన్నారు. తొలకరి సీజన్లో రైతులకు విశేష సేవలందించి సకాలంలో ధాన్యం సొమ్ములు రప్పించేందుకు కృషి చేసిన రామకృష్ణతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ శిలపరశెట్టి మౌళి, వాలంటీర్ కలవల సురేష్ లను కిర్లంపూడి రైతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతులు బీశెట్టి గణేష్, పాలాట్ల తాతబాబు, కట్టు నాని, సంతోష్ మాట్లాడుతూ విత్తనం నాటిన దగ్గర నుండి పంట చేతికి వచ్చే వరకు వ్యవసాయంలో పలు సలహాలు సూచనలు అందజేయడమే కాకుండా రైతు భరోసా కేంద్రం ద్వారా గిట్టుబాటు ధర కల్పించి రైతులకు గ్రామ వ్యవసాయసహాయకులు రామకృష్ణ ఎంతో మేలు చేసారని కొనియాడారు. అనంతరం రామకృష్ణ, మౌళి, సురేష్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీశెట్టి గణేష్, పాలాట్ల తాతబాబు, పెనికేటి సంతోష్ కుమార్, సాదే ఏసుబాబు, కట్టు నాని, బంగారు శేషవుడు, చుక్కా సుబ్బారావు, సాదే డేవిడ్ రాజు, గుద్దాటి వీరబాబు చిక్కాల శ్రీను, మల్లేశ్వరరావు, సేనాపతి సత్తిబాబు, సేనాపతి సురేష్, కొవ్వల నాగభూషణం, దాడి రాంబాబు, కలవల గంగారావు, ఇలకాల రమణ బంగారు గన్నిబాబు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

భూమి సర్వే

విశాలాంధ్ర - తాళ్లపూడి : జగన్న సంపూర్ణ భూ హక్కు పథకం లో భాగంగా వేగేశ్వరపురం గ్రామంలో వి టాల్ డ్రోన్ సహాయంతో ఫీల్డ్ రిసర్వే పూర్తి చేశారు. రెండు రోజుల పాటు వేగేశ్వరపురంలో సుమారు 2600 ఎకరాలు రీ సర్వే జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, రీ సర్వే డిటి భారతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస, సచివాలయ సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లక్ష్యం ఎంచుకుంటే విజయం తథ్యం

విశాలాంధ్ర - గోపాలపురం : లక్ష్యం చిన్నదిగా ఎంచుకుంటే విజయం సాధించడం తథ్యమని ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ తాడేపల్లి మోహన్ అన్నారు. మంగళవారం గోపాలపురం, వాదాలగుంట,జిల్లా పరిషత్ హైస్కూల్, శార్వాణి స్కూల్ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్, అధ్యక్షతన విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ పై మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్వర్యంలో పదవ తరగతి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా తాడేపల్లి మోహన్ మాట్లాడుతూ జీవితంలో విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని చేరుకునే విధంగా పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా గాంధీ,మదర్ థెరిస్సా లాంటి వారు లక్ష్యసాధనలో పట్టుదలతో ముందుకు సాగి విజయాన్ని సొంతం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు మానవతా సంస్థ ఏర్పాటుచేసిన బహుమతులను అందజేశారు. మానవతా సంస్థ మండల అధ్యక్షులు బురెడ్డి వాసు, మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, సంస్థసభ్యులు నెల్లి చంద్రశేఖర్,కుక్కల కీర్తి కుమార్,మల్లిపూడి సతీష్, పాఠశాల కమిటీ చైర్మన్,గుంజే వెంకటరమణ. ఉపాధ్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో శ్రీ జానకికి గోల్డ్‌మెడల్

విశాలాంధ్ర - అనపర్తి : ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 23న జరిగిన రైఫిల్ షూటింగ్స్ సెలక్షన్స్ పిస్టల్ విభాగంలో స్థానిక జీబీఆర్ కళాశాల విద్యార్థిని నల్లమిల్లి శ్రీ జానకి (బి జెడ్ సి, ద్వితీయ సంవత్సరం) గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపల్ ఎన్. పెద్దబ్బాయి రెడ్డి తెలిపారు. వచ్చే నెల 15న మీరట్లో జరిగే స్వామి వివేకానంద సబర్మతి యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా రైఫిల్ షూటింగ్లో పాల్గొనుందని ప్రిన్సిపల్ తెలిపారు. జానకిని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు), ప్రిన్సిపల్ నల్లమిల్లి పెద్దబ్బాయి రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పిఆర్ఎల్ స్వామి, బి. రత్నారెడ్డి, డి వి ఆర్ ఏ పాపిరెడ్డి, కె.హరినాథ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నల్లమిల్లి సత్తిరెడ్డి అభినందించారు.

కాపుల అభ్యున్నతికి కృషి చేస్తాం

విశాలాంధ్ర - సీతానగరం: కాపుల అభ్యున్నతికి కృషి చేస్తామని రాష్ట్ర కాపు నాడు అధ్యక్షుడు పురంసెట్టి మంగరాజు అన్నారు. సీతానగరం మండల అధ్యక్షుడుగా ఎంపికైన సత్యం రామకృష్ణను పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాపు జాతి అభ్యున్నతికి కృషి చేస్తామని అన్నారు. అన్ని వర్గాల వారిని కలుపుకుంటూ పోవాలని అన్నారు. న్యాయ పరంగా కాపులకు రిజర్వేషన్లు వెంటనే అమలు చేసేలా ప్రభుత్వంకు తెలిసేలా పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు జోగిరాజు, మాజీ మండల అధ్యక్షుడు పిండి రాధ కృష్ణా, డాక్టర్ రమేష్, నల్లా నాగేశ్వర రావు మొదలగు కాపు నాయకులు, కాపుల పాల్గొన్నారు.

గౌరీపట్నంలో జాతీయ బాలికల దినోత్సవం

విశాలాంధ్ర - దేవరపల్లి: గౌరీపట్నం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు కె నీరజ అధ్యక్షతన జాతీయ బాలల దినోత్సవం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ మహిళ పోలీస్ కృష్ణవేణి, వెల్ఫేర్ అసిస్టెంట్ జ్యోతి మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు ఆరోగ్యం సామాజిక ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పించారు. సేవ్ ద గర్ల్స్ చైల్డ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు అనంతరం సేవ్ ద గర్ల్ సర్కిల్ వేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు ఉమాదేవి, తిరు మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - భీమవరం : ప్రలోభాలకు తావు ఇవ్వకుండా ఓటు వేయాలని, సమర్థవంతమైన పాలనకు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి అన్నారు. 13 వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయలం రోడ్డులో రెవెన్యూ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను మంగళ వారం జిల్లా కలెక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ యువత ఓటు హక్కు విషయంలో సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటును బాధ్యతగా స్వీకరించాలని, ఓటు ఒక వజ్రాయుధమని అన్నారు. ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగవల్లుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టరు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ ఛార్జ్ డిఆర్వో దాసి రాజు మాట్లాడుతూ 25 న విష్ణు కళాశాలలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, మధ్యాహ్నం రెండు గంటల నుండి బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలలో సుమారు 60 మంది పాల్గొన్నారని ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు, సీనియర్ ఓటర్స్ కు సత్కారం రేపు బీవీ రాజు కళాశాలలో నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు ఇవ్వడం జరుగుతుందని దాసి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు వై. రవికుమార్, చెరుకువాడ రంగసాయి, షిథాల్ భవాని, రంగమణి, అమ్ములారావు, పళ్ళ ఏసుబాబు, కంతేటి వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

విశాలాంధ్ర - కుక్కునూరు : విద్యుత్ షార్టు సర్క్యూట్ తో పెంకుటిల్లు పూర్తిగా కాలిపోయిన సంఘటన బంజరగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది.కుక్కునూరు మండలం బంజరగూడెం గ్రామానికి చెందిన ముత్తినేని మునేశ్వరి ఇల్లు పూర్తిగా కాలిపోయింది.రోజువారీ పొలం పనులకు భర్త శేషు తో మునేశ్వరి వెళ్లగా సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంటి నుంచి చిన్నగా పొగలు వస్తున్నాయని గమనించి కేకలు వేయటంతో చుట్టు పక్కల ప్రజలు వచ్చేసరికి మంటలు పెద్దగా వ్యాపించి ఇల్లు పూర్తిగా కాలిపోయింది.మంటలను అదుపు చేయడానికి చుట్టు పక్కల ప్రజలు ప్రయత్నం చేశారు.ఇంటిలో బీరువా,డబల్ కాట్,టీవీ,ఫ్రిడ్జ్,నగదు యాభై వేల రూపాయలు,లక్ష రూపాయలు విలువ చేసే బంగారం,రేషన్ కార్డు,ఆధార్ కార్డు,పిల్లల స్టడీ సర్టిఫికెట్స్ పైవన్ని పూర్తిగా కాలిపోయాయని బాధితురాలు తెలిపింది.ప్రక్క గదిలో ఉంటున్న ముత్తినేని అన్నపూర్ణ కు చెందిన నగదు అరవై మూడు వేలు, ఇరవై వేల రూపాయలు విలువ చేసే బంగారం,పట్ట భూమి కాగితాలు,ఆధార్ కార్డు,రేషన్ కార్డు అన్ని కాలిపోయాయని బాధితురాలు అన్నపూర్ణ తెలిపింది.

యువగళం పాదయాత్ర విజయవంతానికి పూజలు

విశాలాంధ్ర - పాలకొల్లు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం ప్రజా పాదయాత్ర దిగ్విజయంగా ముందుకు సాగాలని కోరుతూ పాలకొల్లు మండలం దగ్గులూరు సాయిబాబా ఆలయంలో మంగళవారం టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపిటిసి సాగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలలో చైతన్యం నింపేందుకు యువతలో ఉత్సాహం నింపేందుకు యువగళం పాదయాత్ర ఉపయోగపడుతుందన్నారు. లోకేష్ పాదయాత్రకు టిడిపి శ్రేణులు అండగా ఉంటాయన్నారు. స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

యాత్ర విజయవంతానికి పూజా కార్యక్రమాలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: వారాహి వాహనంకు ఎటువంటి అవరోధాలు ఆటంకాలు కలగకుండా విజయవం తంగా యాత్ర కొనసాగాలని కోరు కుంటూ ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు మంగళ వారం ఉంగుటూరు మండలం గోపీనాథపట్నం గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉంగుటూరు వారాహి ప్రచార వాహనానికి సాంప్రదాయ పద్ధతిలో జన సైనికుల సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గం జనసేన నాయకులు జన సైనికులు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - పెదపాడు : బాలికలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ పిడిపి పద్మావతి అన్నారు. కలపర్రు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "జాతీయ బాలికా దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లా డుతూ బాలికలంతా స్వేచ్ఛగా జీవిస్తూ తమ హక్కులను కాపాడుకుంటూ తమకు నచ్చిన రంగంలో అభివృద్ధి పొందేలా బాగా చదువుకుని రాణించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎం అండ్ హెఓ కే నాగేశ్వరరావు, డీఆర్ డీఏ పీడీ విజయ రాజు, డీసీపీఓ డాక్టర్ సిహెచ్ సూర్యచక్ర వేణి, వార్డు సచివాలయాల సమన్వయకర్త టీఎన్ స్నేహన్, కల్వరీ మినిస్ట్రీస్ డైరెక్టర్ మానుకొండ జాన్ ఇశ్రాయేలు, నవసమాజ్ సొసైటీ చైర్మన్ నేతల రమేష్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి తదితరులు ప్రసంగించారు.

యువగళం పాదయాత్ర జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: నారా లోకేష్ ప్రారంభించే యువగళం పాదయాత్రకు సంఘీభావం తెలపాలని ఏలూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు యాళ్ళ సంజీవరావు కోరారు. మంగళవారం గణపవరం మండలం పిప్పర గ్రామంలో తెలుగు దేశం పార్టీ మండల ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడు ఆంద్రు నరసన్న ఆధ్వర్యంలో యువగళం పాదయాత్ర గోడపత్రికలను ఆవిష్కరించారు. నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయడానికి గణపవరం మండలం, నియోజకవర్గ నుండి కూడా యువత ఎక్కువమంది తరలి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పైడిమాల యుగంధర్, జిల్లా ఎస్సి సెల్ కార్యదర్శి దూలపల్లి సోమరాజు, ఉంగుటూరు మండల ఎస్సి సెల్ అధ్యక్షులు నేకూరి ఆశీర్వాదం,నిడమర్రు మండల ఎస్సి సెల్ అధ్యక్షులు ఓగిరాల బాబురావు, మాజీ ఎంపీటీసీ గుండుగొల్లు బాబురావు, నరేంద్రబాబు, కరుణానిధి, చిన్న దర్మయ్య, సీతారాములు, నరేష్, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం యనమదురు గ్రామంలో మంగళవారం నాలుగవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీసారు. గత మూడున్నర ఏళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలును వివరించారు. అదే సమయంలో ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అక్కడిక క్కడే పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల కష్టాలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేం దుకు యనమదుర్రు డ్రైన్ పై నాలుగు వంతెనలు నిర్మించడం జరిగిందన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించేం దుకు జల జీవన్ మిషన్ ద్వారా రూ.21 కోట్ల నిధులను మంజూరు చేయగా పనులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తాసిల్దార్ వై రవికుమార్ సర్పంచ్ బోరాబత్తుల రామ్మూర్తి ,ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, జేఈలు నరసయ్య, శశి కుమార్, శ్రీనివాస్, కనకారావు, తదితరులున్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : క్రీడలు శరీర వ్యాయామాలకు ఎంతో దోహదపడతాయని సాయి రాకేష్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్. ఆర్. ఆర్. నరసింహ రాజు అన్నారు. గవరవరం గ్రామంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము, ఎస్ ఆర్ ఆర్ నరసింహ రాజు, సురక్ష ఆసుపత్రి వైద్యులు కె.దిలీప్ కుమార్ ప్రారంభించారు. యువతను ఉద్దేశించి రాము మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో ముందుండాలని, క్రీడలలో తమ ప్రతిభను కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. దిలీప్ కుమార్ మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, మూడవ బహుమతి రూ 5వేలు అందజేయడం జరుగుతుందన్నారు.24, 25, 26, తేదీలలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని నల్లూరి గోపి తెలిపారు. ఈ క్రీడా పోటీలలో గ్రామస్తులు యువత పాల్గొన్నారు.

బాలికలతోనే ఉత్తమ సమాజం

విశాలాంధ్ర - ఏలూరు : బాలికలకు అవకాశాలు కల్పించడం ద్వారా ఉత్తమ సమాజం, మంచి భవిష్యత్తు ఉంటుందని సి ఆర్ రెడ్డి అటానమస్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ అన్నారు. బాలిక దినోత్సవం సందర్భంగా సిఆర్ఆర్ అటానమస్ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కలలుకనే బాలికలు నిజం గల మహిళలు బాలికలు విద్య అభ్యసించడానికి ఆరోగ్యకరమైన వాతావరణం, రక్షణ శిక్షణ కలిగించాలన్నారు. ప్రస్తుతం మహిళలు బాలికలు అన్ని రంగాలలో విద్య ద్వారా రాణిస్తూ సమాజంలోని అసమానతలు ఎదుర్కొంటూ ధైర్యంగా ముందుకు వెళుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీజీ కోర్సుల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ డా.కే ఏ రామరాజు, డైరెక్టర్ డా .కొండయ్య రావు, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ వీరభద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ కే విశ్వేశ్వర రావు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఎస్ హేమలత, ఉపాధ్యా యులు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సభ్యులు,విద్యార్థినిలు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం అక్కపల్లి గోకవరం యూపీ స్కూలుకు ఫ్రెండ్స్ యూత్ రూ.15వేలు విలువగల మైక్, సౌండ్ సిస్టం మంగళవారం బహుకరించారని ప్రధానోపాధ్యా యులు డి.ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఫ్రెండ్స్ యూత్ సభ్యులను యూపీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు ,గ్రామస్తులు అభినందించారు.

మండలానికి 3 డ్రోన్‌స్ప్రేయింగ్ యూనిట్లు మంజూరు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల :ఎంటర్ సేవా పథకం ద్వారా మండలానికి రూ.10 లక్షల విలువచేసే మూడు డ్రోన్ స్ప్రేయింగ్ యూనిట్లు మంజూరు అయినట్లు వ్యవసాయ అధికారి దుర్గారమేష్ పేర్కొన్నారు. మండలం లోని బుట్టాయిగూడెంలో రైతులకు డ్రోన్ స్ప్రేయింగ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. వరిపంటపై స్ప్రేయింగ్ విదానం చూపించి డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ యూనిట్ ఖరీదు 10లక్షలు కాగా ప్రభుత్వం తరపున 4లక్షలు సబ్సిడి అందజేస్తారన్నారు .డ్రోన్ వినియోగించుకోవడానికి గ్రూపులోని ప్రతిసభ్యు నికి పైలట్ శిక్షణ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బుట్టాయిగూడెం గ్రామసర్పంచ్ వెంకట సుబ్రహ్మణ్యం, సత్తాల గ్రామసర్పంచ్ కొండా బత్తుల సుభద్రమ్మ, వ్యవసాయ సలహామండలి చైర్మెన్ ముల్లంగి ఈశ్వర్ రెడ్డి, పి.జ్యోతి రైతులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమమే వైసీపీ ధ్యేయం

విశాలాంధ్ర - ముదినేపల్లి : ప్రతి గడప సంక్షేమమే వైసీపీ ధ్యేయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరావు పేర్కొన్నారు. మండలంలోని ముదినేపల్లి శివారు అన్నవరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎప్పుడు అమలు పరచలేని సంక్షేమ కార్యక్రమాలు వైసీపీ ప్రభుత్వం చేసిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అన్నిటితో పాటు అదనంగా మరిన్ని పథకాలు ప్రజలకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య , వైస్ ఎంపీపీలు చొపర్ల సునీత , రాచూరి రాధ , సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ బిక్షాలు తదితరులు పాల్గొన్నారు.

ఆల్కహాల్ తరలిస్తున్న లారీ ట్యాంకర్ సీజ్

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : అక్రమంగా లారీలో 8 లీటర్ల ఆల్కహాల్ తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఈ బి సిఐ ఎస్ మణికంఠ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆంధ్ర,తెలంగాణ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మెదక్ నుండి జార్ఖండ్ రాష్ట్రానికి వెళుతుండగా చెక్ పోస్ట్ వద్ద తనిఖీ చేయగా 8 లీటర్ల ఆల్కహాలను ఉన్నట్లు గుర్తించామన్నారు. ట్యాంకర్ డ్రైవర్ శ్రీనివాసన్ పై కేసు నమోదు చేసి టాంకర్ ని, ఆల్కహాల్, సీజ్ చేసి జంగారెడ్డిగూడెం ఎస్ఇబి స్టేషన్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటి ఆకులగూడెం వీఆర్వో కె.బుల్లబులు, వీఆర్ఏ ఎస్ కే సత్తాబి ,సిబ్బంది ప్రవీణ్ కుమార్, ఎస్ కే శాను, జగదీష్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను తొందరలోనే అవగతం చేసుకుని, ఒక్కొక్కటిగా పరిష్కరిం చడం జరుగుతుందని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రి మంగళవారం మీడియాకు వెల్లడించారు. పట్టణంలో పారిశుధ్యం, త్రాగు నీరు, డ్రైనేజీ నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. పందుల సమస్య పరిష్కారానికి పందుల పెంపకం దారులతో త్వరలోనే సమావేశం నిర్వహిస్తామన్నారు.

ప్రహారీగోడ నిర్మాణానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లి మండల పరిషత్ నిధులు పది లక్షల రూపాయలతో దేవరపల్లిలోని నాయి బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు ఎంపీపీ కెవికె దుర్గారావు తెలిపారు. ఎంపీపీ దుర్గారావు, గోపాలపురం ఏఎంసీ డైరెక్టర్ డి గంగాధర్ నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

గోశాలను సందర్శించిన కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర -భీమవరం: గోమాత మన ఆరాధ్య దైవంగా పూజిస్తామని, గోపూజ మన ఆచరమని, సుమారు 100 గోవులను పోషించడం గొప్ప విశేషమని విజయలక్ష్మి గోశాల నిర్వాహకులు పళ్ళ ఏసు బాబును జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అభినందించారు. మంగళవారం కలెక్టర్ పద్మాలయ థియేటర్ రోడ్డులోని శ్రీవిజయలక్ష్మి గోశాలను సందర్శించి గోవులను స్పర్శించి 4 రోజుల పుంగనూరు పేయను ఎత్తుకుని ముద్దాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో గో పెంపకం, గో పూజ ప్రాధాన్యత ఉందని, గృహ ప్రవేశం, సంక్రాంతి తోపాటు వివిధ పూజ పూజా కార్యక్రమంలో తొలిత గోపూజ భారతీయుల సంప్రదాయమని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, లయన్స్ క్లబ్ పట్టణ సెక్రటరీ నరహరి శెట్టి కృష్ణ, కంతేటి వెంకటరాజు, అర్డివో దాసి రాజు, తహశీల్దార్ వై.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర - గోపాలపురం : నాయి బ్రాహ్మణలు కులవృత్తికి పరిమితం కాకుండా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని గోపాలపురం సొసైటీ చైర్మన్ కూసం రామ్మోహన్ రెడ్డి సూచించారు. మంగళ వారం గోపాలపురం బీసీ కాలనీలోని శ్రీ షిరిడి సాయిబాబా నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమ్యూనిటీ హాలులో అయ్యంకి రవి అధ్యక్షతన సమావేశం జరిగింది.తనతండ్రి స్వర్గీయ మాజీ సొసైటీ చైర్మన్ కూసం.గాంధీ రెడ్డి జ్ఞాపకార్థం మోహన్ రెడ్డి నాయి బ్రాహ్మణుల సంఘ అభివృద్ధికి 50.వేల రూపాయల నగదు రూపంలో వారికి అందజేశారు.గతంలో తన తండ్రి ఏ ఎన్నికల్లో పోటీ చేసిన నప్పటికీ నాయి బ్రాహ్మణులు కూడా తమ వంతు సహకారాలు అందించారనీ మోహన్ రెడ్డి అన్నారు. నాయి బ్రాహ్మణులకు ఏ సమస్య వచ్చిన తన వంతు సహకారం అందిస్తానని మోహన్ రెడ్డి అన్నారు. అదేవిధంగా వైకాపా నాయకులు వింత అమర ప్రసాద్ రెడ్డి 10 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కమిటీ సభ్యులు ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పోతుల అప్పిరెడ్డి, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జగత అరవల రాజు, ఉపాధ్యక్షులు.అయ్యంకి గంగరాజు,జగతా రామకృష్ణ..తురాయి.సత్యనారాయణ, శ్రీరాములు తదితరు నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆడపిల్లే పుట్టాలని అందరూ కోరుకునే స్థితి రావాలి

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : ఆడపిల్లే పుట్టాలని అందరూ కోరుకునే స్థితి సమాజంలో రావాలని వైసీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు అన్నారు. మంగళ వారం ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్ల సచివాలయంలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆడపిల్లల సాధికారత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు గుర్తు చేశారు. బాలికలకు మెరుగైన విద్యను కల్పించాలన్న ఉద్దేశంతో విద్యాపరంగా వెనుకబడిన బ్లాక్ పరిధిలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ పేరుతో అనేక పాఠశాలను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనిత ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రథసారథి కన్వీనర్ నందూరి భాస్కరరావు, చోప్పరమేట్ల వైసిపి అధ్యక్షులు పల్లగాని వెంకట కోటేశ్వరరావు, ఎంపీటీసీ గద్దం సాంబశివరావు, కలటూరు సర్పంచ్ రాగవరపు సురేష్, సచివాలయం సిబ్బంది వాలంటరీ లు, పంచాయతీ వార్డు నెంబర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మార్టిన్ లూథర్ అన్నారు దేవరపల్లి మండలంలోని దుద్దుకూరు గ్రామంలో దేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెలగ రామకృష్ణ అధ్యక్షతన ఆయన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల జిల్లా మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో మార్టిన్ లూథర్ మాట్లాడుతూ గత సెప్టెంబర్ ఏడో తేదీ నుంచి జనవరి 26వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్ శ్రీనగర్లో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ 3759 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకోవడం జరుగుతుందని సుమారు ఐదు నెలల ఈ పాదయాత్ర రాహుల్ గాంధీ నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రఫీ ఉల్లా, బిగ్ వెలగా రామకృష్ణ కాకర్ల హరిబాబు, ఫ్రాన్సిస్, వాదయ్యారు పాపులు, గంగారావు, మట్టపర్తి రామ్మోహన్రావు, చాపల వెంకటేశ్వరావు, పిసిసి సభ్యులు సతీష్, నల్లజర్ల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఫ్రాన్సిస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర-టి.నరసాపురం: అపరిష్కృతంగా వున్న బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరికృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ముందు ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సంద ర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఉద్యోగులకు ఐదు రోజుల పనివారాలను అమలు చేయాలని, పాత పెన్షన్ విధానం మళ్ళీ తీసుకురావాలని, బ్యాంకులో ఖాళీ పోస్టులను సత్వరమే భర్తీ చేయాలని డిమాండ్ చేసారు. సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 30, 31 తేదీలలో ధర్నా చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అశోక్ రెడ్డి, క్యాషియర్ శివరాజు, కౌంటర్ క్లర్క్ గోపాల్ దేవ్, లత, యు. సాగర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరకాల ట్రస్ట్ సేవలు మరింత విస్తరణ

విశాలాంధ్ర-పోడూరు : పరకాల ట్రస్ట్ కవిటం పరిసర గ్రామాలలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను హైదరాబాదుకు చెందిన నెట్ క్రేకర్ ఇండియా సాఫ్ట్ వేర్ సంస్థ అందిస్తున్న సహకారంతో నవంబర్ నుండి మరింత విస్తరింప చేస్తున్నామని పరకాల ట్రస్ట్ చైర్మన్ వెల్లడించారు. కవిటంలోని పరకాల ట్రస్ట్ భవనం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ట్రస్ట్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన వివరించారు. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26న కవిటంలో మహిళా సంఘానికి మూడు కుట్టుమిషన్లను, పోడూరు జడ్పీ హైస్కూల్‌కు ప్రింటర్‌ను పోడూరు పాలిటెక్నిక్ కాలేజీకి 2 కంప్యూటర్లను బహుకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2022-23 సంవత్సరానికి నెట్ క్రెకర్ సంస్థ తన సహకారం అందించటం వలన గత ఏడాది నవంబరు నెలనుండి ట్రస్ట్ తమ సేవాకార్యక్రమాలు మరింతగా విస్తరించినట్టు ట్రస్టు చైర్మన్ సూర్యమోహన్ తెలియచేసారు. నెట్క్రేకర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పరకాల ట్రస్ట్ ద్వారా జరప బడుతున్న అనేక సామాజిక సేవా కార్యక్రమాలకు, ఈ ఏడాది సహాయ సహకారాలు అందించినందుకు, ఆ సంస్థకు, మేనేజిగ్ డైరెక్టర్ శ్రీనివాస్ పోతరాజు, వారి సిబ్బంది విజయ కుమార్, కరణం వాగ్దత్తు గోపరాజులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పరకాల ట్రస్ట్ కార్యదర్శి పరకాల రమేష్ బాబు ట్రస్ట్ పరకాల రాజేశ్వరరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పోలీసు డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర - ఏలూరు క్రైమ్ : స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం పోలీసు సంక్షేమ సంఘం పోలీస్ డైరీ 2023 ను అధికారుల సమక్షంలో జిల్లా ఎస్పి రాహుల్ దేవ్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి అవసరమైన విధులకు సంబంధించిన అన్ని విషయాలు ఈ డైరీ లో పొందుపర్చారన్నారు. డైరీలో సెలవులు, ఆదాయపు పన్ను కు సంబంధించిన విషయములు, పోలీస్ ఉత్తర్వులు, అందరికీ ఉపయోగపడే సమాచారం పొందు పరిచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ ఇ బి జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు ఇన్చార్జి డిఎస్పి పైడేశ్వరరావు, పలువురు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సాధారణ సర్వ సభ్య సమావేశం ఎంపిపి అంసూరి సూర్య నారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మండల స్థాయి అధికారు లంతా శాఖలు వారీగా ప్రగతి నివేది కను తెలిపారు. సమావేశంలో జెడ్పిటిసి సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి ఉపాధ్యక్షులు పులగం బుల్లిరెడ్డి , ఉపాధ్యక్షులు శ్రీ కర్రి దాసు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాస రెడ్డి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి బీ.ఎల్.నరసింహం, ఎం.పి.టి.సి. సభ్యులు, గ్రామ సర్పంచ్ లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

26న శ్రీ భారతి విద్యానికేతన్‌లో అక్షరాభ్యాసం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఓమ్మంగి శ్రీ భారతి విద్యానికేతన్‌లో ఈనెల 26న, సరస్వతి దేవి పుట్టినరోజు సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీ భారతి విద్యా సంస్థల అధినేత సుంకర వీరబాబు తెలియజేశారు. కావున ఓమ్మంగి పరిసర గ్రామాల తల్లిదండ్రులు చిన్నారులతో పూజా సామాగ్రితో అక్షర స్వీకరం మహెూత్సవంలో పాల్గొనవలసిందిగా తెలియజేశారు.

25 నుంచి పెంతెకోస్తు మహాసభలు

విశాలాంధ్ర - మండపేట : కరోన కాలంలో సురక్షితంగా కాపాడిన దేవునికి కృతజ్ఞతలు తెలియజేస్తూ 2022 నుండి ఇప్పటి వరకూ బోధనల ద్వారా వేలాది ప్రజలు ఆశీర్వాదాలు అందుకున్న మహిమ ఆవరణలో 2023 సంవత్సరానికి గాను వార్షిక సభల్లో భాగంగా ఈనెల 25 నుండి 31 వరకు పెంతెకోస్తు క్రైస్తవ మహాసభలు నిర్వహిస్తున్నట్టు బిషప్ డాక్టర్ డానియల్ పాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా పెద్ద కాలువ వంతెన వద్ద ఉన్న మహిమ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డానియల్ పాల్ మాట్లాడుతూ దేవుని కృపలో ఈ సభ కూడా మహిమ కార్యంగా నిర్వహిస్తున్నామన్నారు. సంగీత డేనియల్ పాల్ ప్రత్యేక కీర్తనలు అందిస్తారని అన్నారు. పాస్టర్ గుణవీర్ పాల్ సారధ్యంలో సంగీత సహకారం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ప్రాంతాల నుండి ఆత్మ పూర్ణులైన దైవజనులు పాల్గొని సభల్లో ప్రసంగిస్తారన్నారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ ప్రసంగీకులు బ్రదర్ అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి 31వ తేదీ రాత్రి తమ సందేశం అందిస్తారని చెప్పారు. విశ్వాసులు సేవకులు సంఘ కాపరులు సంఘ సభ్యులు సంఘస్తులు వేలాదిగా తరలివచ్చి సభల్లో పాల్గొని దేవుని ఆశీర్వాదం పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

దీప్తి పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం

విశాలాంధ్ర - మామిడికుదురు : జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మంగళవారం దీప్తి పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవ్ గర్ల్స్ అనే ఆంగ్ల అక్షర రూపంలో చిన్నారులు చక్కగా ఒదిగి ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయులు స్వామి నాయుడు మాట్లాడుతూ, సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. భారతదేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న విద్య, పోషకాహారం, బాల్య వివాహాలు, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం వంటి సమస్యలపై సూచనలు ఇచ్చారు.



ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ బాలిక దినోత్సవం

విశాలాంధ్ర - పెనుమంట్ర: ఆలమూరు పంచాయతీ పరిధిలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జాతీయ బాలికల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని, తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నతమైన చదువులు చదివి, తల్లితండ్రులకు ,గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయురాలు వి. అనంతలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెనుమంట్ర మండలం సూపర్వైజర్లు ఆర్ నాగలక్ష్మి, జి ఆదిలక్ష్మి మాట్లాడుతూ బాలికలకు ఉండే హక్కులు, విద్య, లింగ వివక్ష, బాల్యవివాహాలు, దిశా చట్టం, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ శిశు సంక్షేమ శాఖ దేశంలో బాలికలను ముందుకు నడిపించేందుకు గట్టిగా ప్రయత్నిస్తుందన్నారు. సచివాలయ మహిళా పోలీసులు ఎం. రాజేశ్వరి, సి.హెచ్. రవీణ, అంగన్వాడి కార్యకర్తలు, స్థానిక పిహెచ్‌సి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.